ఆదివారం ఆంధ్రభూమి డెయిలీ - 1984-1985

"వివాహితుడైన పురుషుడు భాగ్యవంతుడు, శక్తిమంతుడు కావచ్చు.
కానీ అస్వతంత్రుడు-"

# అస్వతంత్రుడు

గిరిజకు వంటంటే మహాబద్ధకం. పుస్తకాలు చదవడానికీ, సినిమాలు చూడ్డానికీ, షికార్లు కొట్టడానికీ తప్ప తీరుబడి సమయాన్ని మరొకందుకు ఉపయోగించడం ఆమెకు చిరాకు.

ఫిల్టర్ కాఫీకి బదులు నెస్కేఫ్ ఇచ్చేది. వేడివేడి పాలలో ఇన్ని కార్న్‌ఫ్లేక్స్ పోసి టిఫిన్ అనేది, లేదా బ్రెడ్!

"నీకు ఇడ్లీ, దోసె, పూరి లాంటివి ఇష్టముండవా?" అన్నాను హతాశుడినై.

"తినడానికి ఇష్టమే. చేయాలంటే బోరు. సైంటిస్టులకు రుచుల పట్టింపు ఉండదంటారు. మీరు రిసెర్చి చేశారు గదా అని నేనెంతో సంతోషించాను. కార్న్‌ఫ్లేక్స్ లాంటివి ఎంత సుఖమో చూడండి.అదే ఇడ్లీలంటే పిండి రుబ్బాలి, చట్నీ చేయాలి" అన్నది గిరిజ.

"అయితే మా అమ్మ నీకు నా రుచులు, అభిరుచులు చెప్పలేదా?"

"చెప్పారండీ - ఆవిడ మాటలు వింటే నాకు నవ్వొచ్చింది. ఇంకా మీరు అద్దాలనాటి బిడ్డలే అనుకుంటున్నదావిడ. మీకు చేగోడీలు, పెసరపుణుకులు ఇష్టంట.... ఇంత పెద్దయ్యాక కూడా..." అని గిరిజ వస్తున్న నవ్వునాపుకుంది.

"నీకు బాగా వంటలొచ్చునని మా అమ్మ చెప్పిందే!" అన్నాను.

గిరిజ కిసుక్కున నవ్వి "మా అమ్మ తను చేసిన వంటలన్నీ నేనే చేశానని మీ అమ్మగారికి చెప్పింది. పెళ్ళికావలసిన ఆడపిల్ల గురించి ఎవరైనా అలాగే చెబుతారు. అయినా అత్తయ్యగారి వెర్రిగానీ ఈ రోజుల్లో వంటకోసం పెళ్ళి చేసుకునేటంత మూర్ఖపు మగాళ్ళెక్కడున్నారండీ పెళ్ళామంటే తోడుగా ఉండడానికీ, కష్టసుఖాల్లో పాలుపంచుకో డానికీ. వంటకోసం పెళ్లి చేసుకోవాలనుకనే మగాళ్ళు వంట మనిషిని పెట్టుకోవడం మంచిది" అన్నది.

నేను కాసేపు మౌనం వహించి తీవ్రంగా ఆలోచించాను.

ఇలా ఎన్నాళ్ళో కుదరదు. కొత్త మోజులో కొన్నాళ్ళు సహించగలనేమో కానీ నా నాలుక ఏ క్షణంలోనైనా నాపై తిరుగుబాటు చేసేలాగుంది. అందులోనూ అంత్యనిష్ఠూరం కంటే అది ఆది నిష్ఠూరం మేలని పెద్దలన్నారు.

అందుకని ఆ రాత్రి ఓ మంచి ఘడియ చూసుకుని శ్రీమతికి నా రుచులు,

అభిరుచులు గురించి చెప్పుకుని, "నన్ను నువ్వు పూర్వ కాలపువాడిని అనుకో మూర్ఖుడిని అనుకో - తిండి విషయంలో నేను రాజీపడలేను. నువ్వు నాకు సహకరించాలి. నాకు కాస్త రుచిగా నేను కోరినవి చేసిపెట్టు. అంతకు మించి నేను నిన్నేమీ అడగను" అంటూ జాలిగా, దీనంగా వేడుకున్నాను.

అప్పుడు గిరిజ చాలా నొచ్చుకుని "అయ్యో పాపిష్టిదాన్ని! అసలు విషయం తెలియక మిమ్మల్నెంతగా నొప్పించానో ఏమిటో! రేపట్నించి అన్నీ మీ కిష్టమైనవే చేసి పెడతాను" అన్నది. నేను చాలా సంతోషించాను.

గిరిజ నాకు మాటైతే ఇచ్చింది కానీ అమలు చేయడానికి చాలా ఇబ్బందులు పడేది. కూరకంటే వేపుడు చేయానికే ప్రయత్నించేది. సాయంత్రం నేనింటికి రాగానే "టిఫినింకా చేయలేదండి. బయటకు వెడదామా, చేయమంటారా?" అని వద్దంటానేమో నని ఆశగా చూసేది.

నా అసహాయస్థితికి నాకే జాలివేసేది. నేనేమీ అనకపోవడం చూసి గిరిజకు జాలివేసేదో ఏమో అప్పుడప్పుడు నాకిష్టమైన చిరుతిళ్ళు చేసేది. ఎటొచ్చీ అవి తింటే వాటి మీద నా ఇష్టంపోయేది.

గిరిజ వంటను శ్రద్ధగా చేసేది కాదు. ఒకోసారి పప్పు నలిగేది కాదు. ఒకోసారి పదార్థం వేగేది కాదు. సాధారణంగా ఉప్పో, కారమో, పులుపో ఏదో ఒకటి తక్కువో ఎక్కువో అవుతూండేది.

నా భార్యనేమీ అనలేక నా నోట్లో శని ఉన్నదనుకుని సరిపెట్టుకున్నాను.

అలా కొద్ది నెలలు గడిచాక ఒకరోజున గిరిజ నాతో "మనం ఒక మిక్సీ కొందామండీ - అదుంటే వంటలు రకరకాలు చేయగలను నేను. క్షణాల్లో పనైపోతుంది. కాబట్టి ఎప్పుడు ఏది కావాలంటే అది చేసుకోవచ్చు" అన్నది.

నేను చాలా సంతోషించాను. అంటే శ్రీమతి నాగురించి ఆలోచిస్తున్నదన్నమాట!

"ఈ మాట ముందే చెబితే ముందే మిక్సీ కొని ఉండేవాణ్ణి" అన్నాను నేను.

"మధ్యాహ్నం ఓ సేల్సుమేన్ వచ్చాడండీ... అతడో మిక్సీ చూపించాడు. చాలా బాగుంది. అందులో జార్సుకి గానీ బ్లేడ్సుకిగాని ఏమీ అంటుకోవు. ఇడ్లీ పిండి రుబ్బుకుని బయటకు తీసేసుకున్నాక నీళ్ళతో కడిగి తుడిచేసుకోవడమే!" అన్నది గిరిజ. ఆమె ఆ సేల్సుమెన్‌ని రాత్రి ఏడింటికి మళ్ళీ రమ్మన్నది నాకు చూపించడం కోసం.

సేల్సుమన్ సరిగ్గా ఏడింటికి ఠంచనుగా వచ్చాడు.

మిక్సీ చాలా అందంగా ఉన్నది. పేరు జాక్‌పాట్! ఖరీదు వెయ్యి రూపాయలు. ఆ మిక్సీలో రకరకాల సదుపాయాలున్నాయి. మర్నాడుదయం ఏడింటికి ఏదైనా రుబ్బుకోవాలనుకుంటే మిక్సీలో ఓ చిన్న గడియారం ఉన్నది అందులో టైము అడ్జస్టు చేసుకుంటే మర్నాడుదయం ఆ టైముకు మినీ సైరన్ మ్రోగుతుంది. మనిషి దగ్గర లేకుండా రెండేసి నిముషాలకోసారి అరనిముషం చొప్పున తనంతటతనే ఆగి మళ్ళీ తిరుగుతూంటుంది. అలా కాకుండా మిక్సీని ఇంతసేపు ఆగకుండా తిరిగేలా సెట్

చేసుకోవాలన్నా సెట్ చేసుకోవచ్చును. అంటే ఆగకుండా పది నిముషాలు పని చేసేలా టైమర్ ఏర్పాటు చేసుకుంటే అది అంతసేపు తిరిగి ఆగిపోతుంది. వోల్టేజి దాని పరిమితికి మించినా తగ్గినా అది దానంతటదే ఆగిపోతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అది షాక్ ఇవ్వదు.

నా భార్యవంటి బద్ధకస్తులకు ఈ మిక్సీ ఒక వరం అని చెప్పవచ్చును. ఇన్నాళ్ళూ వద్దనుకుని ఇప్పుడు మిక్సీ ఎందుకు కొనాలని గిరిజ అన్నదో నాకు అర్థమయింది.

"ఈ మిక్సీని నేను కొంటాను" అన్నాను.

"మీరు సగం డబ్బు నాకిస్తే వారం రోజుల్లో ఈ మిక్సీని మీ ఇంటికి తెచ్చి ఇవ్వగలను" అన్నాడు సేల్సుమన్.

ముక్కూ ముఖం ఎరుగని వాడిని నమ్మి డబ్బివ్వడానికి నాకు మనస్కరించలేదు. అప్పటికప్పుడు ఇంట్లో డబ్బులేదు. ఎవర్నీ అప్పడగటానికి మనస్కరించదు నాకు. మర్నాడు ఆదివారం. బ్యాంకుకు సెలవు. సోమవారం నాడైతే మిక్సీకి డబ్బివ్వగలనని చెప్పాను. తనకు మళ్లీ రావడం వీలుపడదనీ జాక్‌పాట్ మిక్సీ ఇంత సులభంగా సంపాదించుకునే అవకాశం పోగొట్టుకోవద్దనీ సేల్సుమన్ హెచ్చరించాడు. గిరిజ కూడా ఆత్రపడింది. కానీ చేయగలిగిందేమీ లేదు.

సేల్సుమన్ వెళ్ళిపోయాక "ఏం చేస్తాం? మిక్సీ కోసం అయిదారు నెలలు ఎదురు చూడక తప్పదు" అన్నాన్నేను. గిరిజ నిరుత్సాహంగా ఊరుకుంది.

అప్పుడు నాకు గుర్తుకొచ్చింది. మా ఊళ్ళో షాపులకు ఆదివారం సెలవు లేదు. రేపంతా తిరిగి ఎక్కడైనా జాక్‌పాట్ మిక్సీ వెంటనే దొరికే అవకాశమున్నదేమో గమనించాలి.

మర్నాడు సాయంత్రం నేను, శ్రీమతి షాపింగుకి వెళ్ళాం. ఓ షాపులో లోపల షోకేసు నిండా సర్ది ఉన్న జాక్‌పాట్ మిక్సీలు కనపడ్డాయి. అంటే సేల్సుమన్ చెప్పింది అబద్ధమన్నమాట అనుకుంటూ అక్కడ ధర వగైరా వివరాలడిగాను.

"ధర వెయ్యి రూపాయలు. ఈ రోజు డబ్బు కట్టేస్తే ఆర్నెల్ల తర్వాత మీకు మిక్సీ దొరుకుతుంది" అన్నాడు షాపువాడు.

"ఇప్పటికిప్పుడు కావాలంటే స్టాకులోంచి దొరకదా?" అన్నాను. వాటం చూస్తే ఈ మిక్సీకి మంచి గిరాకీ ఉన్నట్లుంది. రేపు వెంటనే ఒకటి కొనాలనుకున్నాను.

"స్టాకు లేదు కదండీ" అన్నాడు షాపువాడు.

"ఉంటే చూడండి. రేపు డబ్బు తీసుకుని వస్తాను" అని స్వరం తగ్గించి "అవసరమైతే కాస్త ఎక్కువిస్తాను" అన్నాడు.

"అబ్బే అలాంటిదేం లేదండి. నిజంగానే స్టాకు లేదు" అన్నాడు షాపువాడు.

నేనెంత బ్రతిమాలినా వాడు ససేమిరా అంటూంటే చివరకు విసిగిపోయి "స్టాకు లేదు, స్టాకు లేదు అంటావు. ఆ షోకేసులోనివన్నీ ఏమిటి?" అన్నాను.

"అయ్యో అది స్టాకు కాదండి!" అన్నాడు షాపువాడు.

"మరేమిటి?" అన్నాను ఇంకా విసుగ్గానే.

"అవన్నీ రిపెయిర్స్ కొచ్చినవి..." అన్నాడు షాపువాడు.

ఉలిక్కిపడ్డాను. ఒకటి కాదు రెండు కాదు వరుసగా పేర్చి యాభైకి పైగా ఉన్నాయవి. రిపెయిర్‌కు అన్ని మిక్సీలే! అంతలా రిపెయిర్‌కొచ్చే మిక్సీ కొనుక్కుని ఏం సుఖం!

"మనంచాలా అదృష్టవంతులం. అయిదువందలు నష్టపోవలసిన వాళ్ళం ప్రమాదం తప్పిపోయింది" అని శ్రీమతితో అని అక్కణ్ణించి బైటపడ్డాను.

"నేను మీ దురదృష్టం గురించి ఆలోచిస్తున్నానండీ, పాపం! మీకు అన్ని రకాలూ చేసి పెట్టే అవకాశం నాకింకలేదు" అన్నది గిరిజ.

అంటే గిరిజ మరో మిక్సీ కొనే ఉద్దేశ్యంలో లేదన్నమాట.... అసలు ఈ మిక్సీ గురించి కూడా తను బెంగపెట్టుకున్నదేమోననిపించింది. పైకి విచారం నటిస్తూన్నా లోలోపల ఆమెకు సంతోషంగానే ఉండి ఉండాలి.

నా చిరుతిండి సమస్య అలాగే ఉండిపోయింది. అది నా మనసును వేధిస్తూండగా ఒక రోజు డిపార్టుమెంటులో స్నేహితుడు దయాకర్‌కీ విషయం చెప్పుకున్నాను. "నీ సమస్యను నేనుచిటికెల మీద పరిష్కరించగలను" అన్నాడు దయాకర్.

"ఎలా?"

"ఓ వంట మనిషిని కుదుర్చుకో..."

"ఆ ఖర్చు నేను భరించలేను" అన్నాను.

"అలా కాదు" అన్నాడు దయాకర్.

వంట మనిషిని పెట్టుకుంటానని గిరిజకు చెప్పాలి. ముందు మగవాడి గురించి ఆలోచించాలి. అప్పుడు దయాకర్ ఓ రోజు సాయంత్రం మా ఇంటికి వచ్చి మగవాళ్ళు వంటవాళ్ళుగా చేరి హత్యలూ, మానభంగాలూ చేసిన కథలు చెప్పి గిరిజను హడల గొడతాడు. అప్పుడు నేను ఆడవాళ్లను వంటకు పెట్టుకోవాలంటాను. అప్పుడు దయాకర్ వంటమనుషులుగా చేరి కాపురాలు కూలగొట్టిన ఆడవాళ్ళ కథలు చెబుతాడు.

గిరిజ హడలిపోతుంది. నేను ఆడవంటమనిషి గురించి నొక్కిస్తాను. గిరిజ తనే వంట చేయాలనుకుంటుంది.

ముందుగా ఒక రోజంతా రిహార్సల్ చేసుకుని మర్నాడీ నాటకాన్ని గిరిజ ముందు ప్రదర్శించాము. నాటకం అనుకన్న ఫలితం సాధించినట్లే కనపడింది.

దయాకర్ వెళ్ళిపోయాడు. అప్పుడు గిరిజ నా దగ్గరకు వచ్చి "ఏమండీ మనం వంటమనిషిని పెట్టుకుందాం కానీ ఆడపిల్లవద్దు" అన్నది.

నేను కంగారుగా "మగవాడైతే నీకు ప్రమాదం కదా" అన్నాను.

"అందుకే - నేను ముందుగా కరాటే నేర్చుకుని అప్పుడు వంటవాణ్ణి పెట్టుకుందామనుకుంటున్నాను" అన్నది గిరిజ.

నేను తెల్లబోయాను. కరాటే సాధన అంటే మామూలు వ్యవహారం కాదు. దానికి

బాగా వళ్ళు వంచాలి. వళ్ళు వంచి వంట చేయలేని గిరిజ కరాటే నేర్చుకోగలదా?

"కరాటే కంటే వంట చేయడమే సుఖమేమో" అన్నాను సంకోచిస్తూ.

"నేను వంట చేసినా మీకు సుఖమేముంది? వంటవాడైతే రుచిగా చేస్తాడు. వంటవాడు కావాలనుకుంటే నేను కరాటే నేర్చుకోక తప్పదు. మీకోసం ఆ మాత్రం శ్రమపడలేనా" అన్నది గిరిజ.

"మీ కోసం ఆ మాత్రం శ్రమపడలేనా" అన్న ఆమె మాటలు చాలా అన్యాయంగా తోచాయి నాకు.

గిరిజ కరాటే స్కూల్లో చేరింది. ఆమె కరాటే ఏం నేర్చుకుంటున్నదో నాకు తెలియదు కానీ స్కూల్లో చేరిన మర్నాట్నించీ ఇంట్లో మళ్ళీ కార్న్‌ఫ్లేక్స్, బ్రెడ్స్ స్థానం సంపాదించుకున్నాయి. పులుపు, కారం వాడకం తగ్గిపోయింది.

"మీ కోసం చేస్తే నాకు తినాలనిపిస్తుంది. కరాటేకు కొన్ని ఆహార నియమాలున్నాయి. నా కోసం కొన్నాళ్ళు సహించరూ ప్లీజ్!" అని గిరిజ గోముగా అడిగేసరికి నేను కరిగిపోయి ఒప్పేసుకున్నాను.

అలా ఆర్నెల్లు గడిచాయి. ఈ మధ్యకాలంలో నా జిహ్వ చచ్చిపోయినప్పటికీ ప్రతి ఒక్కరూ నా ఆరోగ్యం మెరుగయిందనీ, నాకు రంగు వచ్చిందనీ, వళ్ళు చేశాననీ వ్యాఖ్యానిస్తూ శ్రీమతి వంట అందుకు కారణమయుండవచ్చు నంటూండేవారు. ఇది గిరిజ చేసిన ఏర్పాటేమోనని ఏమూలో నాలో అనుమానముంది.

ఆర్నెల్ల తర్వాత గిరిజ నెల తప్పింది. అందుకని కరాటే మానేసింది. గిరిజకు సాయంగా కొన్నాళ్ళుండాలని అమ్మ వచ్చింది.

"హమ్మయ్య" అనుకున్నాను.

అయితే అమ్మ నాకోసం ఏమేమో చేస్తుందన్న నా ఆశలు వ్యర్థమయ్యాయి. గిరిజ పుస్తకాలూ అవీ ఇచ్చి అమ్మకు తన బద్ధకాన్ని మప్పేసింది. పైగా అమ్మతో "ఆయనింకా అప్పటి మనిషేననుకుంటున్నారా! ఆ రుచులు ఇప్పుడు లేవు" అని చెప్పింది.

నేను బ్రెడ్, కార్న్‌ఫ్లేక్స్ లాంటి టిఫిన్సుతో సరిపెట్టుకోవడం చూసిన అమ్మ "ఎలాగైనా పెళ్ళయ్యాక మగాళ్లిట్టే మారిపోతారు" అని ముక్కు మీద వేలేసుకుంది నాముందే!

జీవితాంతం శ్రీమతితో జీవించవలసినవాడిని కాబట్టి అమ్మముందు శ్రీమతిని చిన్నబుచ్చడం ఇష్టంలేక ఊరుకున్నాను.

పెళ్ళయ్యాక మగాళ్ళు మారిపోతారని నేనూ విన్నాను కానీ ఆ మార్పు అనుభవంలోకి వచ్చేసరికి చాలా బాధగానూ, ఆవేదనగానూ ఉంది.

వివాహితుడైన పురుషుడు భాగ్యవంతుడైనా, శక్తిమంతుడైనా అస్వతంత్రుడే అవుతాడనడంలో సందేహం లేదు!

✦ ✦ ✦